అలేఖ్య కుటుంబానికి న్యాయం చేయాలి

ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్షం నాయకులు

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 22 : ఖానాపూర్ పట్టణానికి చెందిన అలేఖ్యను ప్రేమ పేరిట వేధించి, దారుణంగా హత్య చేసిన యువకుడిని కఠినంగా శిక్షించాలని గురువారం ఎస్పీ జానకి షర్మిలకు అఖిలపక్షం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. హత్య జరిగి 15 రోజులు అవుతున్నదని, పోలీసులు నిందితుడికి శిక్షపడే విధంగా చర్యలను వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు నంది రామయ్య, రాజన్న, శంకర్, నర్సయ్య, ప్రణీత్, వెంకటస్వామి, మోహన్, రాకేశ్, పురుషోత్తం, రామ్-లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడి

కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 22 : విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్మల్ కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న వెంటనే అక్కడి పోలీసులు లోపలికి అనుమతించకపోవడంతో గేటు వద్ద ధర్నా నిర్వహించారు. సమస్యలను పరిష్కరించాలని, ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. విద్యా సంవత్సరం ముగుస్తున్నా పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోవడం ఇబ్బందిగా ఉందని మండిపడ్డారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు రఘు, శశాంక్, సాయిచరణ్, వంశీ పాల్గొన్నారు.

బోధనపై కలెక్టర్ అసంతృప్తి

విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

గుడిహత్నూర్, ఫిబ్రవరి 22 : గుడిహత్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల విషయ సామర్థ్యాన్ని గురువారం కలెక్టర్ రాహుల్‌రాజ్ పరీక్షించారు. కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు సరైన సమాధానాలు చెప్పలేకపోవడంతో ఉపాధ్యాయుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు సరిగ్గా బోధించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభ్యసన స్థాయిని పెంచాలని, వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు కలెక్టర్ స్వయంగా గణితం బోధించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం రుచికరమైన భోజనం పెట్టాలని ఏజన్సీ నిర్వాహకులను ఆదేశించారు. గతంలో నిర్వహించిన పరీక్షల మూల్యాంకనంలోని మార్కులను తనిఖీ చేశారు. వెంట ఎంఈవో నారాయణ, తహసీల్దార్ కవితారెడ్డి, హెచ్ఎం దేవీదాస్ ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 22 : విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల అన్నారు. పోలీసు శాఖకు చెడ్డపేరు తీసుకొస్తే సహించేది లేదని, పోలీస్ సిబ్బంది అంకితభావంతో పనిచేసి అందరికీ ఆదర్శంగా నిలవాలని సూచించారు. నర్సాపూర్‌కి చెందిన జగత్‌రాం ప్రభుత్వ ఆసుపత్రిలో ఔట్ పోస్టుగా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ యువతితో అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు ఆమెపై దురుసుగా వ్యవహరించడంతో బాధిత యువతి హెడ్ కానిస్టేబుల్‌పై బుధవారం ఫిర్యాదు చేసింది. అతనిపై విచారణ చేపట్టిన అధికారులు గురువారం హెడ్ కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించి శాఖ పరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రజలకు పోలీసులంటే గౌరవం పెరిగేలా ఉండాలని, పోలీసు శాఖకు చెడ్డ పేరు తీసుకొస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

ఉపాధికి కేరాఫ్.. పరిశ్రమల శాఖ

సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటు అవకాశం

ఎదులాపురం, ఫిబ్రవరి 22 : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలను నెలకొల్పడానికి, ఉపాధి అవకాశాలు కల్పించడానికి జిల్లా పరిశ్రమల శాఖ కేరాఫ్‌గా నిలుస్తున్నది. నిరుపేద, మధ్య తరగతి ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అండగా నిలుస్తున్నాయి. రెండేండ్ల కాలంలో ఆదిలాబాద్ జిల్లాలోని యువతీ, యువకులకు ఉపాధి కల్పిస్తూ ఆర్థికంగా ఎదగడానికి దోహదపడుతున్నది. కాగా.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జిల్లా పరిశ్రమల శాఖ ద్వారా టీఎస్ ఐపాస్ కింద 2022-23 సంవత్సరానికి గాను 16 పరిశ్రమలకు అనుమతి ఇవ్వాలి. కానీ.. దరఖాస్తులు అధికంగా రావడంతో 38 పరిశ్రమలకు అనుమతులు ఇచ్చారు. ఇందులో తొమ్మిదింటికి రూ.86 లక్షలు మంజూరు చేయగా.. 112 మందికి ఉపాధి లభించింది. 2023-24 సంవత్సరానికి గాను ఇప్పటివరకు 25 పరిశ్రమలకు అనుమతి ఇవ్వాలి ఉండగా.. 31 పరిశ్రమలకు అనుమతలు ఇచ్చారు. ఇందులో ఆరు పరిశ్రమలకు రూ.1.40 కోట్లు మంజూరు చేసి 42 మందికి ఉపాధి కల్పించారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు టీ-ప్రైడ్ స్కీం కింద 2022-23 సంవత్సరానికి గాను డీఎల్‌సీ కింద 43 యూనిట్లకు రూ.1.22 కోట్లు.. 2023-24 సంవత్సరానికి గాను 11 యూనిట్లకు రూ.35.90 లక్షలు మంజూరు చేశారు.

జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయం

పీఎంఈజీపీ పథకం..

జిల్లా పరిశ్రమ శాఖ ద్వారా ప్రధానమంత్రి ఉపాధి కల్పనా పథకం(పీఎంఈజీపీ) కింద 2022-23లో 60 యూనిట్లను లక్ష్యంగా పెట్టుకున్నారు. 170 దరఖాస్తులను వివిధ బ్యాంకులకు పంపించారు. 65 యూనిట్లకు అనుమతి లభించగా.. రూ.2.20 కోట్ల సబ్సిడీ మంజూరయ్యింది. అలాగే 42 యూనిట్లు గ్రౌండ్ చేయగా.. రూ.1.35 కోట్ల సబ్సిడీ మంజూరు చేసి 548 మందికి ఉపాధి కల్పించారు. మిగిలిన దరఖాస్తులు వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్నాయి. 2023-24 సంవత్సరానికి గాను 39 యూనిట్లు లక్ష్యం కాగా.. 87 దరఖాస్తులను వివిధ బ్యాంకులకు పంపించారు. ఇందులో 31 యూనిట్లకు అనుమతి రాగా.. 13 యూనిట్లు గ్రౌండింగ్ చేసి రూ.41.96 లక్షల సబ్సిడీ మంజూరైంది. 89 మందికి ఉపాధి కల్పించారు. వివిధ దశలో 33 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

పీఎంఎఫ్ఎంఈ పథకం..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ సంస్థల క్రమబద్ధీకరణ పథకం(పీఎంఎఫ్ఎంఈ) నిర్వహిస్తున్నాయి. ఈ పథకం కింద 2022-23 సంవత్సరానికి గాను 157 దరఖాస్తులను వివిధ బ్యాంకులకు రుణం మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించారు. ఇందులో 63 యూనిట్లకు అనుమతి రాగా.. రూ.1.08 కోట్లు మంజూరయ్యాయి. 30 యూనిట్లను గ్రౌండింగ్ చేసి రూ.60 లక్షల సబ్సిడీని మంజూరు చేశారు. 159 మంది ఉపాధి కల్పించారు. 31 దరఖాస్తులు వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే 2023-24(డిసెంబర్ నాటికి) 65 దరఖాస్తులను వివిధ బ్యాంకులకు పంపించారు. ఇందులో 34 యూనిట్లకు అనుమతి రాగా.. 24 యూనిట్లను గ్రౌండింగ్ చేసి రూ.21 లక్షల సబ్సిడీని మంజూరు చేశారు. ఫలితంగా 72 మందికి ఉపాధి లభించింది. వివిధ దశల్లో 31 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

ఉద్యోగుల కంటే అధికంగా సంపాదించవచ్చు..

ప్రభుత్వ ఉద్యోగం కోసం వేచి చూడకుండా స్వయం ఉపాధి రంగంలో రాణించవచ్చు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ ద్వారా సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధితో ఉద్యోగుల కంటే అధికంగా సంపాదించవచ్చు. ఒక్కో లబ్ధిదారుడికి రూ.50 లక్షల వరకు రునం మంజూరు చేస్తున్నాం. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 35 శాతం, పట్టణ ప్రాంతాల్లో 25 శాతం సబ్సిడీ వస్తున్నది. 18 సంవత్సరాల పైబడిన వారు రుణాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నాం. **- డి.పద్మభూషణ్ రాజు, జీఎం, జిల్లా పరిశ్రమల శాఖ**

విద్యుత్ కొరత లేకుండా చూడాలి

- వీసీలో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 22 : అన్ని జిల్లాల్లో విద్యుత్ వినియోగదారులు, రైతులకు విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్(వీసీ) నిర్వహించిన ఆయన ఆయా జిల్లాల్లో వ్యవసాయ రంగానికి, పరిశ్రమలకు, గృహ వినియోగదారులకు అమలు చేస్తున్న విద్యుత్ సరఫరా వివరాలను అడిగి తెలుసుకున్నారు. డిమాండ్‌కు తగ్గ సరఫరా చేసేటట్లు చూడాలన్నారు. విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి సాంకేతిక లోపాలు ఏర్పడితే వెంటనే సరిదిద్దాలని సూచించారు. జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ జయంత్‌రావు చౌహాన్ వారం నుంచి విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని తెలిపారు. దీనికి ప్రధాన కారణం రైతులు సాగు చేసుకుంటున్న పంటలకు రైతులు నీళ్లు పెట్టుకోవడం వల్లనే అని తెలిపారు. సమీక్ష నిర్వహించి విద్యుత్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈ నాగరాజు, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీ అధ్యాపకుడికి డాక్టరేట్

చాంద్ రాకేశ్ రోషన్‌ను అభినందిస్తున్న డైరెక్టర్

బాసర, ఫిబ్రవరి 22 : ఆర్జీయూకేటీ ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌లో అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్న చాంద్ రాకేశ్ రోషన్‌కు డాక్టరేట్ రావడంతో ట్రిపుల్ ఐటీ వైస్ చాన్స్‌లర్ వెంకటరమణ, డైరెక్టర్ సతీశ్‌కుమార్ అభినందించారు. ఘన పదార్థాల సూత్రల గణనలను ఉపయోగించి విస్తరించిన ఫోనాన్ ద్వారా ఉష్ణ ప్రవాహాన్ని అర్థం చేసుకోవడంలో సాధించాడు. వరంగల్ ఎన్ఐటీ డాక్టరేట్ అవార్డును ప్రకటించినట్లు తెలిపారు.

ఆర్టీసీ అధికారులు.. బస్సులు నడపండి..

మూడు రోజులుగా అవస్థలు పడుతున్నాం..

- ఆటోలు, జీపుల్లో డబ్బులు అధికంగా తీసుకుంటున్నారు..
- రోడ్డు గుంతలమయంతో వాహనాలు పాడైపోతున్నాయని అద్దె బస్సు యజమానుల ఆవేదన
- కేసీఆర్ సర్కారు రోడ్డు మంజూరు చేసినా ప్రారంభించని కాంగ్రెస్
- 45 గ్రామాలకు చెందిన దాదాపు 10 వేల మంది ప్రజలు ఆవేదన

బస్టాండ్‌లో బస్సు కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు

భీంపూర్, ఫిబ్రవరి 22 : ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఆర్టీసీ బస్సులు నడుపకపోవడంతో అవస్థలు పడుతున్నారు. మేడారం జాతర నేపథ్యంలో అధికారులు పలు రూట్లలో బస్సులను తగ్గించారు. ఈ రూట్లో మాత్రం బంద్ చేశారు. ప్రైవేట్ వాహనాలు కూడా రోడ్డు సక్రమంగా తక్కువగా నడుపుతున్నారు. గుబిడి, కరంజి, గోముత్రి సహా 45 గ్రామాల ప్రజలు ఆటోలు, జీపుల్లో రూ.50-రూ.200 చెల్లించి ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తున్నారు. ఆదిలాబాద్ నుంచి కరంజి(టి) గ్రామానికి గత కేసీఆర్ సర్కారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్డు పనులు ప్రారంభించడానికి మీనమేషాలు లెక్కిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆర్టీసీ వారి అద్దె బస్సులకు రోజుకి 85 లీటర్ల డీజిల్ ఖర్చవుతుండగా.. ఆర్టీసీ వారు 65 లీటర్లు అని నమోదు చేసుకోవడంతో తాము రోజుకి రూ.2 వేలు నష్టపోతున్నామని, రోడ్డు ఆధ్వాన్నంగా ఉండడంతో టైర్లు పాడవుతున్నాయని అందుకే ఈ రూట్‌లో బస్సులు నడుపలేకపోతున్నామని హసేన్ అనే ప్రైవేటు హైర్ బస్సు యజమాని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం కరంజి రోడ్డును పూర్తి చేసే దిశగా అడుగులు వేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బస్సులు లేక ఇబ్బంది..

మూడు రోజులుగా బస్సులు లేవు. రోడ్డు బాగా లేదంటున్నారు. నేను ఆదిలాబాద్ వరకు ఆటోలో వచ్చా. ఒక్కొక్కరికి రూ.100 చార్జి తీసుకున్నారు. బీఆర్ఎస్ సర్కారు రోడ్డు మంజూరు చేసింది. ఆ పనులు మొదలు చేయడం కాంగ్రెస్ సర్కారుతో కావడం లేదు. ఇలాగైతే మా గ్రామాలకు బస్సులు నడుపుడు అనుమానమే. అధికారులు మా రోడ్డు నిర్మాణంపై శ్రద్ధ చూపాలి. **- కలికోట లక్ష్మణాచారి, కరంజి(టి), భీంపూర్ మండలం.**

పదేళ్లలో బీజేపీ ఏం చేసిందో చెప్పాలి

- జిల్లాలోని సిమెంట్ పరిశ్రమ, విమానాశ్రయం, రైల్వేలైన్ ఏమయ్యాయి?
- బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడు..
- పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందడానికే యాత్రలు
- బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి రామన్న

మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, ఫిబ్రవరి 22(నమస్తే తెలంగాణ) : కేంద్రంలో అధికారం వెలగబెడుతున్న బీజేపీ ప్రభుత్వం పదేండ్ల పాలనలో ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ఏం చేసిందో చెప్పాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న డిమాండ్ చేశారు. గురువారం ఆయన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లాలో బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప యాత్రకు ప్రజాదరణ కరువైందని, అసహనంతో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ బీఆర్ఎస్‌పై వ్యాఖ్యలు చేస్తున్నారన్నారని మండిపడ్డారు. కేంద్రం సాయం లేకుండానే కేసీఆర్ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు వివరించారు. ఆదిలాబాద్‌లో సీసీఐ పునఃప్రారంభం, విమానాశ్రయం ఏర్పాటు, ఆర్మూర్ రైల్వేలైన్‌కు ఇచ్చిన హామీలను బీజేపీ విస్మరించిందని మండిపడ్డారు. ఐదేళ్లుగా ఎంపీగా ఉన్న సోయం బాపురావు జిల్లాకు ఏ ఒక్క పని చేయలేదని ఆరోపించారు. రాముడు అందరి దేవుడని, అయోధ్యను బీజేపీ రాజకీయంగా వాడుకుంటున్నదని, మతం పేరిట ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడని సూచించారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీ సంస్థలతో ప్రతిపక్ష నాయకులపై దాడులు చేయిస్తుందన్నారు. బండి సంజయ్‌తో పాటు ఇతర రాష్ట్ర నాయకులను ప్రజలు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తిరస్కరించారని, పార్లమెంట్ ఎన్నికల్లో కూడా బీజేపీకి ఓటమి తప్పదన్నారు. సంస్కారహీనులుగా మాట్లాడుతున్న బీజేపీ పార్టీ నాయకులకు పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

బీజేపీతో పొత్తు పెట్టుకోం..

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని మాజీ మంత్రి జోగు రామన్న తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో ఐటీ కంపెనీల ఏర్పాటు, టవర్ నిర్మాణం, వ్యవసాయ, జేఎన్టీయూ, ఇంజినీరింగ్ కళాశాలలు, రిమ్స్ సూపర్ స్పెషాలిటీతోపాటు వ్యవసాయం, విద్య, రవాణా రంగాల్లో ఆదిలాబాద్ జిల్లా ప్రగతి సాధించినట్లు తెలిపారు. ప్రధాని మోదీ ప్రకటించిన ఏటా 2 కోట్ల ఉద్యోగాలు, ఉచిత సిలిండర్, జనధన్ ఖాతాల్లో రూ.15 లక్షలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వేలైన్‌కు కేంద్రం రూ.7 వేల కోట్లు మంజూరు చేసిందని బీజేపీ నాయకులు అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తోడు దొంగలుగా వ్యవహరిస్తున్నాయన్నారు. ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్నదని, కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలతోపాటు 420 హామీలు, డిక్లరేషన్‌పై నిలదీస్తామన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు విజ్జిగిరి నారాయణ, మైనార్టీ నాయకులు జోహురొద్దీన్, అశోక్ స్వామి, శ్రీనివాస్, రామ్‌కుమార్, సవాతే శ్రీనివాస్ పాల్గొన్నారు.

శివాలయం ప్రారంభం

శివాలయ ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

లోకేశ్వరం, ఫిబ్రవరి 22 : ఎడ్దూర్ గ్రామంలో నిర్వహించిన శివాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, నిర్మల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు విఠల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ శ్యాంసుందర్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, వైస్ చైర్మన్ గంగాధర్, మాజీ సర్పంచ్ లక్ష్మణ్ పటేల్, పీఏసీఎస్ డైరెక్టర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

అల్లోలకు పరామర్శ


అల్లోలను పరామర్శిస్తున్న డీసీసీ అధ్యక్షుడు

సోన్, ఫిబ్రవరి 22 : మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సోదరుడు హన్మంత్‌రెడ్డి రెండు రోజుల క్రితం మృతి చెందాడు. ఈ నేపథ్యంలో నిర్మల్ మండలంలోని ఎల్లపెల్లి గ్రామంలో మంత్రి అల్లోలతోపాటు వారి కుటుంబసభ్యులను గురువారం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు పరామర్శించారు. ఈయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

మోదీకి రాముడిపై ఉన్న ప్రేమ దళితులపై లేదు..

- దళితులు సంతోషంగా బతకడం మోదీకి ఇష్టం లేదు..
- దళిత వ్యతిరేక పార్టీ బీజేపీ
- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి

మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి

ఎదులాపురం, ఫిబ్రవరి 22 : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి రాముడిపై ఉన్న ప్రేమ దళితులపై లేదని, దళితులు సంతోషంగా బతకడం ఆయనకు ఇష్టం లేదని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో 'బీజేపీని ఓడిద్దాం.. మాదిగలను గెలిపిద్దాం' అని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి మండిపడ్డారు. హైదరాబాద్ నుంచి ప్రారంభించిన మాదిగల జోడో యాత్రలో భాగంగా గురువారం జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ముందుగా అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేఆర్కే కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రకారం ఎస్సీ రిజర్వేషన్ శాతాన్ని పెంచాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ పార్టీకి ఓటు వేస్తే మత కల్లోలాలు, కింది జాతుల అణచివేతతో రాష్ట్రం తీవ్ర సంక్షోభంలోకి వెళ్తుందన్నారు. బీజేపీ రిజర్వేషన్లకు వ్యతిరేకమని ప్రభుత్వ రంగాలను ప్రైవేటు పరం చేసి రిజర్వేషన్లను దాదాపు తగ్గించిందన్నారు. బీజేపీ పార్టీకి ఓటు వేస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు జీవనం కొనసాగించడం కష్టం అవుతుందన్నారు. బీజేపీని ఓడించడమే 30 ఏళ్ల వర్గీకరణకు మాదిగలు ఇచ్చే సంపూర్ణ మద్దతు అన్నారు. యాత్ర శుక్రవారం ఇంద్రవెల్లి, ఖానాపూర్, పెద్దపల్లి, కరీంనగర్‌లో ఉంటుందన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిద్దాం

- నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 22 : పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నదని, రాజకీయ పార్టీలు తమవంతు సహకారం అందించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల నాయకులతో ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఇప్పటికే జిల్లాలో ఎన్నికల ఆదేశాల మేరకు తుది ఓటరు జాబితా ప్రకటించామన్నారు. ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ యూనిట్లు 1,067, కంట్రోల్ యూనిట్లు 1,362 అందుబాటులో ఉన్నాయని, వీటిని తనిఖీ చేశామని తెలిపారు. ఈనెల 26 నుంచి రెండో దశ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 922 పోలింగ్ కేంద్రాల్లో మహిళలు 3,79,880, పురుషులు 3,53,786, ఇతరులు 51 మంది ఉన్నారని తెలిపారు. పద్దెనిమిదేండ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించామని తెలిపారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, ఎన్నికల పర్యవేక్షకులు శ్రీనివాస్, రాజకీయ పార్టీల నాయకులు రవికుమార్, శ్రావణ్‌రెడ్డి, జగన్, హైదర్, హైమద్, రమేశ్, మజర్, నూతన్‌కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, హాజరైన అధికారులు

వంద శాతం పన్నులు వసూలు చేయాలి..

- నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 22 : నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీతోపాటు గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులను ఈనెల 29వ తేదీలోపు వంద శాతం వసూలు చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం పన్నుల వసూళ్లపై మున్సిపల్, గ్రామ పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించారు. మార్చి 31వ తేదీతో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, నిర్దేశించిన లక్ష్యం మేరకు పన్నులను వసూలు చేయాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయ పన్నులను పెండింగ్ లేకుండా చూడాలని పేర్కొన్నారు. పన్నులు వసూలు చేయని అధికారులపై చర్యలు తప్పవని తెలిపారు. అధిక మొత్తంలో బకాయి పడ్డ సంస్థలకు నోటీసులు అందించి సీజ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు రాజు, వెంకటేశ్వర్‌రావు, మనోహర్ పాల్గొన్నారు.